సమస్యల్లో సర్కారు బడి..!?

- కూలిన పాఠశాల ప్రహరీ
- బేంచీలు లేక కింద కూర్చుంటున్న విద్యార్థులు
- మన ఊరు మన బడిలో చేర్చని వైనం



కింద కూర్చొని చదువుతున్న విద్యార్థులు



మల్కాపూర్ పాఠశాలలో కూలిన ప్రహరీ

బోయినపల్లి: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. రెండేళ్ల క్రితం ప్రైమరీ పాఠశాల నుంచి యూపీఎస్‌గా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలో సమస్యలు తీరడం లేదు. పాఠశాలను మన ఊరు మన బడిలో చేర్చలేదు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఉన్న పాఠశాలలో 72 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. మూడు గదులు ఉన్నాయి. మారుమూలన ఉన్న మల్కాపూర్ గ్రామంలో విద్యా వసతుల మెరుగుకు ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతూ బడిని ఎలాగోలా నడిపిస్తున్నారు.

గురువులకు కుర్చీలు లేవు.. పిల్లలకు బల్లలు లేవు

ఒకటి నుంచి ఏడు తరగతులు ఉన్న పాఠశాలలో కేవలం ఏడో తరగతి విద్యార్థులకు మాత్రమే కొన్ని బెంచీలు ఉన్నాయి. మిగతా ఒకటి నుంచి ఆరు తరగతుల విద్యార్థులు కింద కూర్చొని విద్యను అభ్యసిస్తున్నారు. కంప్యూటర్ యుగంలో విద్యార్థులు కింద కూర్చుని విద్యను అభ్యసించడం గమనార్హం. పాఠశాలకు ప్రహరీ లేక పలుసార్లు పశువులను ఆవరణలో కట్టేసిన దాఖలాలు ఉన్నాయి. దీంతో పాఠశాల పరిసరాలు సైతం అపరిశుభ్రంగా మారాయి. త్వరలో ప్రహరీ నిర్మాణం చేపడుతామని ఎస్ఎంసీ చైర్మన్ అమిరిశెట్టి భూంరెడ్డి తెలిపారు. కాగా పాత బడి భవనం కూలిపోయే దశలో ఉంది. కొత్త భవనంలో ఉన్న మూడు గదుల్లో, వరండాలో విద్యార్థులు చదువులు వెళ్లదీస్తున్నారు. తాగునీటి సౌకర్యం కోసం ఇటీవల గ్రామానికి చెందిన పలువురు వాటర్ ట్యాంకు నిర్మాణం చేసుకున్నారు. కిచెన్ షెడ్ వర్షం పడిన సందర్భంలో ఊరుస్తుంది. పాఠశాలలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని అంటున్నారు.

మన ఊరు మన బడిలో చేర్చాలి



ఫర్నీచర్, బేంచీలు లేక మల్కాపూర్ పాఠశాలలో విద్యార్థులు కింద కూర్చుని చదువుకుంటున్నారు. పాఠశాలకు ప్రహరీ లేక పరిసరాలు అధ్వానంగా మారాయి. కలెక్టర్ వెంటనే పాఠశాలను మన ఊరు మన బడిలో చేర్చి అభివృద్ధి చేయాలి.
– ఎడపల్లి పర్శరాములు, మల్కాపూర్

రెండో విడతలో అభివృద్ధి



మల్కాపూర్ పాటశాలను పీఎస్ నుంచి గతంలో యూపీఎస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. పాఠశాలలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. రెండో విడత మన ఊరు మన బడి కార్యక్రమంలో పాఠశాలను చేర్చి అభివృద్ధి చేస్తాం.
– శ్రీనివాసదీక్షిత్, ఎంఈవో, బోయినపల్లి

క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో పెన్షనర్ల పరిశీలన



తనిఖీ చేస్తున్న పెన్షన్ అధికారి పాపారావు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పెన్షన్ అధికారి పాపారావు మంగళవారం క్షేత్రస్థాయిలో పెన్షనర్ల పెన్షన్ వివరాలను పరిశీలించారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి కుటుంబ సభ్యులు పెన్షన్ పొందుతున్నారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు పాపారావు తెలిపారు. మండలంలోని పద్మనగర్, మల్లాపూర్, తంగళ్లపల్లికి చెందిన పలువురిని విచారించి పెన్షన్ తొలగించినట్లు తెలిపారు.

కంటి వెలుగు శిబిరాల సందర్శన



పరిశీలిస్తున్న బోయినపల్లి ఎంపీపీ వేణుగోపాల్

బోయినపల్లి/తంగళ్లపల్లి: బోయినపల్లి మండలంలోని కొదురుపాక, తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ గ్రామంలో కంటివెలుగు వైద్య శిబిరాలను ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఎంపీడీవో లచ్చాలు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతీ గ్రామంలో కంటివెలుగు శిబిరాలు నిర్వహించి కంటి పరీక్షలు చేస్తారన్నారు. వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, వైద్యధికారి రేణుప్రియాంక, మెడికల్ అధికారి రేఖ, ప్రియదర్శిని, ఆప్తామాలజిస్ట్ రాకేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయాలి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంటిజెన్స్ వర్కర్స్‌తో సర్కారు చేయిస్తున్న వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని బీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముద్రకోల ఆంజనేయులు కోరారు. ఈమేరకు కార్మికులతో కలిసి మంగళవారం సిరిసిల్ల కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికులను సత్వర న్యాయం చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. యూనియన్ నాయకులు అనుషా, పద్మ పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని వాసవీనగర్, మొదటి బైపాస్, గాంధీనగర్, మార్కెట్ ఏరియా, మున్నూరుకాపు సత్రం, అంబేడ్కర్‌నగర్, మేన్‌రోడ్డు,ముదిరాజ్‌వీధి, మోచీవాడ, ఉప్పుగడ్డ, సుభాష్‌నగర్, సుబ్రమణ్యంనగర్, తిప్పాపూర్, అయ్యోర్‌పల్లి, బద్దిపోచమ్మవీధి, ఓల్డ్ అర్బన్‌కాలనీ, న్యూఅర్బన్ కాలనీ, రాజీవ్‌నగర్, చెక్కపల్లిరోడ్, మల్లారం రోడ్డు, మార్కండేయనగర్, కోరుట్లబస్టాండ్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెస్ వినియోగదారులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి: మండల కేంద్రంతో పాటు విలాసాగర్, వెంకట్రావుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఫీడర్ మరమ్మతు పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

నియామకం

కాంగ్రెస్ గ్రామశాఖ కార్యవర్గం

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అదే గ్రామానికి చెందిన పరశురాంగౌడ్, ముస్కుపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా బెజ్జంకి అంజయ్యను ఎన్నుకున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల వెంకటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడిగా రాములు

ఎల్లారెడ్డిపేట: బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షునిగా కాసుల రాములును నియమిస్తూ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, జిల్లా అధికార ప్రతినిధి బండారి బాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంచర్ల రాజు నియామక పత్రాన్ని అందించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

ఎల్లారెడ్డిపేట: రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీతో లబ్ధి పొందాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాచర్ల గొల్లపల్లి శాఖ మేనేజర్ లింగారెడ్డి కోరారు. మండలంలోని రాచర్లతిమ్మాపూర్‌లో మంగళవారం నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. పీఎంజేజేబీవై బీమా చేసిన మరణించిన మహిళా గ్రూప్ సభ్యురాలు నమిలికొండ భాగ్య రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ బాబు, ఉపసర్పంచ్ దేవయ్య, ఫీల్డ్ ఆఫీసర్ నరేందర్, ఐకేపీ సీసీలు, సీఏలు, పాల్గొన్నారు.

టాలెంట్ పరీక్ష

సిరిసిల్లటౌన్: ప్రధాని మోదీ దిశా నిర్దేశంలో బీజేపీ దేశవ్యాప్తంగా సర్కారు విద్యార్థులకు 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని మంగళవారం సిరిసిల్ల కుసుమ రామయ్య పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షలో వందల సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వరి గడ్డి దగ్ధం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన మేర్గు శ్రీనివాస్ పశువుల కోసం కొనుగోలు చేసి నిల్వ ఉంచిన ఎనిమిది ట్రాక్టర్ల వరిగడ్డి మంగళవారం ప్రమాదవశాత్తుగా మంటలు అంటుకుని చేలరేగి పూర్తిగా దగ్ధం అయింది. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.



ఘనంగా మార్కండేయ జయంతి

రుద్రంగి/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/తంగళ్లపల్లి: జిల్లా వ్యాప్తంగా మార్కండేయ ఆలయాల్లో మంగళవారం మార్కండేయ జయంతి కార్యక్రమం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మహిళకు పసుపు, కుంకుమ కార్యక్రమం ఏర్పాటు చేసి పసుపు, కుంకుమ అందజేశారు. భక్తుల సౌకర్యార్థం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పవర్లూమ్ టెక్స్‌టైల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామ శివారులో వ్యవసాయ పొలాలు, నివాసాల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. గతంలో రెండు ఎద్దులు విద్యుదాఘాతంతో మరణించాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి. ఇప్పటికైనా సెస్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : దివ్య, సెస్ ఏఈ, ఎల్లారెడ్డిపేట
ఫోన్ నెం. 94408 14081

సెస్ పరిధిలో మెరుగైన సేవలు



సెస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, సెస్ డైరెక్టర్

బోయినపల్లి: సిరిసిల్ల సెస్ పరిధిలోని గ్రామాల్లో మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని సెస్ వినియోగదారుల సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయం మొత్తం కలియ తిరుగుతూ నిరుపయోగంగా ఉన్న సెస్ కార్యాలయ భవనం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లూజ్ వైర్లు సరిచేయాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. సెస్ సిబ్బంది అందుబాటులో ఉండి వినియోగదారుల సమస్యలు పట్టించుకోవలన్నారు. సెస్ కార్యాలయ సరిహద్దులు ఏర్పాటు చేసుకుని కార్యాలయం అందుబాటులోకి తెచ్చేలా చూడాలని ఆదేశించారు. మొదటిసారి కార్యాలయానికి వచ్చిన ఆయనకు ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సెస్‌డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ సన్మానించారు. కార్యాలయ సిబ్బంది సైతం సెస్ చైర్మన్ సన్మానించారు. కార్యక్రమంలో సెస్ ఎండీ రామకృష్ణ, ఏడీఈ ప్రభాకర్, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, సంబ లక్ష్మీరాజం, గుంటి శంకర్, మేడుదుల మల్లేశం, సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

జీపీ భవనాలు మంజూరుపై హర్షం

రుద్రంగి: రుద్రంగి మండలంలో నూతనంగా ఏర్పడ్డ చింతామనితండా, గైదిగుట్ట తండా, సర్పంచ్ తండా, వీరునితండా గ్రామాల్లో జీపీ భవన నిర్మాణానికి ప్రొసిడింగ్స్ రావడంతో నాలుగు గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రై సైకిల్ ఇప్పించాలని వినతి

ఎల్లారెడ్డిపేట: మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు మేడిశెట్టి రాజశేఖర్ తనకు ట్రై సైకిల్ ఇప్పించాలని సెస్ డైరెక్టర్ కృష్ణహరికి వినతిపత్రం అందించాడు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం పీఆర్‌టీయూ తెలంగాణ డైరీని సర్పంచ్ గనప శివజ్యోతి ఆవిష్కరించారు.

రైతులకు అందుబాటులో మార్కెట్ సేవలు

బోయినపల్లి: రైతులకు అందుబాటులో మార్కెట్ సేవలు ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోయినపల్లి మార్కెట్ కమిటీ చేర్మెన్ లెంకల సత్యనారయణరెడ్డి పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోనరావుపేట: మండలం శివంగాలపల్లి, నిజామాబాద్ కు చెందిన మోతె రాంరెడ్డి కి రూ. 10 వేలు, గాజర్ల ప్రశాంత్‌కు రూ. 16 వేలు, తాళ్లపెల్లి కల్పన రూ 50 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సర్పంచ్ శివంగాల సురేశ్, వైస్‌ఎంపీపీ సుమలత అందజేశారు.

ఇల్లంతకుంట: మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన పెంట మహేష్‌కు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమీషన్ సభ్యుడు వోరగంటి ఆనంద్ సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60 వేలు చెక్కును అందజేశారు.

పశువైద్య శిబిరానికి స్పందన

కోనరావుపేట: కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలం కనగర్తిలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. అగ్రహారం డెయిరీ మేనేజర్ రవీందర్‌రెడ్డి, కనగర్తి అధ్యక్షుడు జిల్లెల్ల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి

- చందుర్తి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లావణ్య
- సమస్యలపై అధికారుల నిలదీత
- పల్లె ప్రకృతి వనాల, శ్మశానవాటిక మరమ్మతులకు నిధులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

చందుర్తి: మండలంలోని సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతోందని ఎంపీపీ బైరగోని లావణ్య అన్నారు. చందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బైరగోని లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా రుద్రంగి ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్ హాజరయ్యారు.

➡ వ్యవసాయ శాఖ సమావేశాలపై తమకు సమాచారం ఇవ్వడం లేదని

➡ గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు సమావేశాలు నిర్వహించే విషయం సమాచారం ఇవ్వడం లేదన్నారు.

➡ స్త్రీ నిధి రుణం కింది మహిళ సంఘాల సభ్యులకు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని , అవసరం ఉన్న వారిచే దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం రజిత కోరారు.

➡ మల్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో 200 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని పాఠశాలకు వ్యాయమ ఉపాధ్యాయుడిని నియమించాలని మల్యాల సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ కోరారు.

➡ బండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించడం లేదని అన్నారు.

➡ మూత్రశాలలు లేని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధి హామీ పథకంలో వాటిని నిర్మాణం జరిగే చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ కోరారు.

➡ ఎల్లంపల్లి పైపులైన్ పనుల భూముల అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని కాపాడాలని లింగంపల్లి ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్‌రావు కోరారు.

➡ కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని అటవీ శాఖ అధికారి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పత్తి రవీందర్, ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు, పంచాయతీరాజ్ శాఖ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈలు వెంకటేశ్వర్లు, రవిశంకర్ , వివిధ శాఖల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కోరం లేక మండల సభ వాయిదా

- సమావేశాన్ని బహిష్కరించిన సభ్యులు

కోనరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఎంపీటీసీ సభ్యులు ఒక్కరే హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ రాక కోసం మరో గంట ఎదురు చూశారు. అప్పటికీ జెడ్పీ చైర్‌పర్సన్ సహా అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలు హాజరుకాలేదు. దీంతో జరుగాల్సిన మండల సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ ప్రకటించారు.

మండల సభను బహిష్కరించిన ఎంపీటీసీలు

మండల సభలో తమకు గౌరం దక్కడంలేదని ఎంపీటీసీలు కోనరావుపేట మండల సభను బహిష్కరించారు.సమావేశాన్ని ఎంపీటీసీలు సామూహికంగా బహిష్కరించారు. తమను ఎన్నుకున్న గ్రామంతో పాటు.. మండలంలో ఎక్కడ కూడా గౌరవం దక్కడంలేదని తాము కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే ఉన్నామని ఆవేదన చెందుతున్నారు. నిధులు, విధులు లేక గ్రామంలో కుర్చీలేక చేసే పనిలేక అప్పుల పాలై అథోగతి పాలవుతున్నామని అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల సమావేశాన్ని బహిష్కరించి తమ నిరసనను వ్యక్తం చేస్తే ప్రభుత్వానికి తెలిసివస్తుందని భావించామని ఎంపీటీసీలు పేర్కొన్నారు.

న్యాయవాదులకు ఆటల పోటీలు



క్యారమ్ ఆడుతున్న మహిళా న్యాయవాదులు

వేములవాడ: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండోర్ స్కిల్ గేమ్స్ మంగళవారం కొనసాగాయి. బార్ అసోసియేషన్ రూమ్‌లో క్యారమ్, చెస్, స్కిల్ గేమ్స్, పోలీస్‌స్టేషన్ ఆవరణలో షటిల్ గేమ్స్ కొనసాగాయి. మహిళా న్యాయవాదులు సైతం క్యారమ్స్‌లో తలపడ్డారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడిసె సదానందం, స్పోర్ట్స్ సెక్రటరీ బొడ్డు ప్రశాంత్, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు విడుదల చేసిన 2023 క్యాలెండర్‌ను న్యాయవాదులకు పంపిణీ చేశారు.

బాలిక దినోత్సవం



చెక్కపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

వేములవాడరూరల్/వేములవాడఅర్బన్/సిరిసిల్లఎడ్యుకేషన్: వేములవాడ రూరల్ మండలంలో వేములవాడలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలో మంగళవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిరిసిల్ల జెడ్పీహెచ్ఎస్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించారు.